## విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించండి



మాట్లాడుతున్న ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఒడ్డెన్న

బర్కత్‌పుర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాల విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలని హైదరాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి డి. ఒడ్డెన్న అన్నారు. విద్యార్థులను ప్రోత్సహించే బాధ్యత ఫిజికల్ డైరెక్టర్లపై ఉందన్నారు. మంగళవారం హైదరాబాద్ జిల్లా జూనియర్ కాలేజ్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్ల సమావేశం కాచిగూడలో జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సెల్ ఫోన్‌లకే పరిమితం అవుతున్నారని, వారిని మైదానాలలోకి తీసుకెళ్లి క్రీడల్లో ప్రాక్టీస్ చేయించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి. లక్ష్మయ్య, హైదరాబాద్ జిల్లా జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. జక్కయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఉమారావు తదితరులు పాల్గొన్నారు.

## సోయం బాబురావు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి



మాట్లాడుతున్న మాజీ ఎంపీ రవీంద్రనాయక్

నల్లకుంట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించిన తర్వాతనే ఏబీసీడీలుగా విభజించాలని మాజీ ఎంపీ సోయం బాబురావు చేసిన వ్యాఖ్యలను మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రవీంద్రనాయక్ తీవ్రంగా ఖండించారు. సోయం బాబురావు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 12 కోట్ల మందికిపైగా గల బంజారా జాతిని పాలకులు విస్మరిస్తున్నారని, సోయం బాబురావు బంజారాల న్యాయమైన డిమాండ్లపై ఏనాడూ పార్లమెంట్‌లో ప్రస్తావించలేదని ఆరోపించారు. పదేళ్ల పాలనలో రూ. 23 లక్షల కోట్ల బడ్జెట్‌ను అవినీతిమయం చేసిన కేసీఆర్‌పై ప్రధాని మోదీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బి. మురళీకృష్ణ, స్వామి నాయక్, మాణిక్ బాబు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## గాంధీనగర్‌లో కార్పొరేటర్ పావని పర్యటన



ట్రాఫిక్ పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

చిక్కడపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లో కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ ట్రాఫిక్ పోలీస్ అధికారులతో కలిసి మంగళవారం పర్యటించారు. ప్రమాదల నివారణకు ట్రాఫిక్ సిగ్నల్స్, స్పీడ్ బ్రేకర్లు ఎక్కడ ఏర్పాటు చేయాలో పరిశీలించారు. అశోక్‌నగర్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతో పోలీస్ చెక్‌పోస్ట్ ఏర్పాటు లేదా ట్రాఫిక్ పోలీసును నియమించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## చిక్కడపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా మల్లికార్జున్ బాధ్యతల స్వీకరణ

చిక్కడపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా ఎ. మల్లికార్జున్ నియమితులయ్యారు. మేడ్చల్ డీఐజీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మల్లికార్జున్ అశోక్‌నగర్‌లోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చిక్కడపల్లి సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసిన సతీష్‌కుమార్ రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు.

## 'లంబాడీలకు మంత్రివర్గంలో అవకాశం కల్పించాలి'

రాంనగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో లంబాడీలకు అవకాశం కల్పించాలని కోరుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నర్సింహనాయక్ ఆధ్వర్యంలో మంగళవారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లంబాడీలకు మంత్రివర్గంతోపాటు నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని, ఎస్టీల అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్లను ఏఐసీసీ అగ్రనేతలకు అందజేశామని తెలిపారు.

## ప్రతి బస్తీలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయాలి



మహిళకు మందులు అందజేస్తున్న కార్పొరేటర్

రాంనగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రతి బస్తీలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ బి. పద్మావెంకట్‌రెడ్డి సూచించారు. మంగళవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ భరత్‌నగర్ కమ్యూనిటీ హాలులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి కార్పొరేటర్ సూచించారు. కార్యక్రమంలో అంబర్‌పేట సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ హేమలత, డాక్టర్ దీప్తి, మాజీ కార్పొరేటర్ బి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అషుర్‌ఖానాలో సామూహిక ప్రార్థనలు

ముషీరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ అషుర్‌ఖానాలో మంగళవారం సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. హిందూ, ముస్లింలు దట్టీలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## 'ఎస్‌ఆర్‌టీ ఖాళీస్థలంలో పార్కు ఏర్పాటు చేయాలి'

చిక్కడపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): జవహర్‌నగర్ ఎస్‌ఆర్‌టీ క్వార్టర్స్‌లో ఖాళీ స్థలంలో పార్కు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ సీనియర్‌నేత సాయికీర్త్(బాబీ) ఆధ్వర్యంలో నాయకులు శీలం సత్యనారాయణ, జగదీశ్, సురేష్‌యాదవ్, మారిశెట్టి నర్సింగ్‌రావు, నర్సింగ్ ముదిరాజ్, గిరిబాబు, నవీన్, బాబురావు స్థలాన్ని మంగళవారం పరిశీలించారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు బాధితులకు అందజేత

కవాడిగూడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): చోరీ అయిన, పలువురు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం బాధితులను దోమలగూడ పోలీస్‌స్టేషన్‌కు పిలిచి ఫోన్లను వారికి అందజేశారు. సెల్‌ఫోన్ పోయినా, చోరీ అయినా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్‌హెచ్‌వో డి. శ్రీనివాస్‌రెడ్డి, డిటెక్టివ్ సీఐ ఎం. వరప్రసాద్ సూచించారు.

## కేబుల్ వైర్ల తొలగింపును తక్షణమే నిలిపివేయాలి

- కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే విద్యుత్ శాఖ కుట్ర
- కేబుల్ టీవీ అండ్ ఇంటర్నెట్ సర్వీసెస్ ప్రొవైడర్స్ అసోసియేషన్

బర్కత్‌పుర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ గ్రేటర్ పరిధిలోని విద్యుత్ స్తంభాలకున్న కేబుల్ వైర్లను తొలగిస్తూ వాటిపై ఆధారపడి జీవిస్తున్న లక్షలాది మంది కుటుంబాలను వీధిపాలు చేస్తున్నదని తెలంగాణ కేబుల్ టీవీ అండ్ ఇంటర్నెట్ సర్వీసెస్ ప్రొవైడర్స్ అసోసియేషన్ ఆరోపించింది. కేబుల్ వైర్ల తొలగింపును తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డేగల సతీష్‌బాబు, ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్, ఉపాధ్యక్షులు సలీమ్ మాట్లాడుతూ.. ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా విద్యుత్ శాఖ అధికారులు గ్రేటర్ పరిధిలోని ఈసీఐఎల్, బండ్లగూడ, మాదాపూర్, లాలాగూడ, బేగంపేటతోపాటు పలు ప్రాంతాలలో కేబుల్ టీవీ వైర్లను తొలగించారని, దీనివలన కేబుల్, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయి ఆపరేటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విధి విధానాలను రూపొందిస్తే తాము విద్యుత్ స్తంభాలకు ట్యాక్స్ చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని, చెన్నై తరహాలో కేబుల్ వ్యవస్థను తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇంటర్నెట్ వ్యవస్థ కేబుల్ వినియోగదారులకు న్యాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు జైపాల్, పూర్ణచందర్, శివాజీ, రమణ, సతీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



రాంనగర్ చౌరస్తాలో జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



కవాడిగూడలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు



జవహర్‌నగర్‌లో జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న సికింద్రాబాద్ మహాకాళి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుండు జగదీశ్‌బాబు తదితరులు



అడిక్‌మెట్‌లో ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న తెలంగాణ జనసమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నర్సయ్య, కె. సురేందర్ తదితరులు

### ప్రొఫెసర్ జయశంకర్‌కు

# ఘన నివాళి

ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, తెలంగాణ జనసమితి నాయకులు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జయశంకర్ ఆశయ సాధనకు యువత కృషి చేయాలని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు.



జవహర్‌నగర్‌లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతిలో బీఆర్‌ఎస్ నాయకులు



ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిటీ సెంట్రల్ లైబ్రరీ కార్యదర్శి పొట్లూరు పద్మజ, ఉద్యోగులు, పోటీపరీక్షల అభ్యర్థులు



అంబర్‌పేట తిరుమలనగర్‌లో జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం నాయకులు భాస్కర్‌చారి, వేణుగోపాల్, వినోద్‌కుమార్ తదితరులు

## గద్దర్ ఆశయ సాధనకు యువత కృషిచేయాలి



గద్దర్‌కు నివాళులర్పిస్తున్న వెన్నెల, రాజు ఉస్తాద్ తదితరులు

కవాడిగూడ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజా గాయకుడు గద్దర్ తన పాటల ద్వారా ఇచ్చిన జ్ఞానాన్ని భావితరాలకు చేరవేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన కుమార్తె వెన్నెల అన్నారు. గద్దర్ ఆశయ సాధనకు నేటియువత పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆలిండియా షెడ్యూల్డు కులాల హక్కుల పరిరక్షణ సొసైటీ జాతీయ అధ్యక్షుడు రాజు ఉస్తాద్ ఆధ్వర్యంలో మంగళవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద గద్దర్ ప్రథమ వర్ధంతి నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం, గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వెన్నెల మాట్లాడుతూ.. గద్దర్ చివరి శ్వాస వరకు నిరుపేదల హక్కులు, సంక్షేమానికి తన ఆట, పాట ద్వారా అనేక ప్రదర్శనలు ఇచ్చారని గుర్తుచేశారు. నిరుపేదల న్యాయమైన హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

రాజు ఉస్తాద్ మాట్లాడుతూ.. గద్దర్ ఆశయాలను కొనసాగించేందుకు ఆయన కుమార్తె వెన్నెల చేస్తున్న కృషిని అభినందించారు., అన్ని వర్గాల ప్రజల హక్కుల సాధనకోసం కృషి చేసిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని అన్నారు. ఆయన సేవలను గుర్తించి కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం వెన్నెలకు నామినేటెడ్ పదవి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ మాలమహానాడు వారియర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు జంగా శ్రీనివాస్, బేర బాలకిషన్, బి. సత్యనారాయణ, చెరుకు రాంచందర్, ఉత్తమ్, సుమన్, కేవీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ క్యాలెండర్‌ను వ్యతిరేకించడం తగదు

బర్కత్‌పుర, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌ను బీఆర్‌ఎస్ వ్యతిరేకించడం తగదని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ అన్నారు. మంగళవారం 5 మంత్ర కెరియర్ పాయింట్‌లో బద్దం పురుషోత్తం రెడ్డి రూపొందించిన ఇండియన్ సొసైటీ స్ట్రక్చర్ ఇష్యూస్ అండ్ సోషల్ మూమెంట్స్ అనే గ్రూప్-1 మెయిన్స్ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒకతరం జ్ఞానాన్ని మరో తరానికి పుస్తకాల ద్వారానే అందించగలుగుతామన్నారు. గ్రూప్-1 మెయిన్స్‌కు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులకు ఈ పుస్తకం దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్‌ను వ్యతిరేకించడం అంటే ఉద్యోగాల కల్పనను వ్యతిరేకించడం అన్నారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు జాబ్ క్యాలెండర్‌పై అపోహలు సృష్టిస్తున్నారని, వారు తమ వైఖరిని మార్చుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ రాజు, వివిధ స్టడీ సర్కిల్స్ డైరెక్టర్స్ మహేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్, ప్రసన్నా హరికృష్ణ, నియోమెంటార్స్ డైరెక్టర్ భరత్, అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ మహేష్, పుస్తక రచయిత బద్దం పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనాథాశ్రమంలో నోట్ పుస్తకాల పంపిణీ

ముషీరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ మైనార్టీ కమిటీ చైర్మన్ హర్షద్ షేక్ అన్నారు. మంగళవారం ఎంపీ, కాంగ్రెస్ మైనార్టీ కమిటీ చైర్మన్ ఇమ్రాన్ ప్రతాప్ గర్హీ పిలుపు మేరకు కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్ మైనార్టీ కమిటీ కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రావణ్ గండి ఆధ్వర్యంలో ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోం అనాథాశ్రమంలో బాలికలకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డేవిడ్, సలీం, నవీన్, ఇస్మాయిల్, అక్తర్ తదితరులు పాల్గొన్నారు.



బాలికలకు నోట్ పుస్తకాలను పంపిణీ చేసిన కాంగ్రెస్ గ్రేటర్ హైదరాబాద్ మైనార్టీ కమిటీ చైర్మన్ హర్షద్ షేక్, కో-ఆర్డినేటర్ డాక్టర్ శ్రావణ్ గండి

**నిత్యావసరాలు..**

శ్రీనివాస్ కళ్యాణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెయిన్‌బో అనాథాశ్రమంలో బాలికలకు మంగళవారం నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ స్వప్న మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ట్రస్ట్ నాయకులు బి. శ్రీధర్‌రావు, సంపత్‌కుమార్, హరిప్రియ, అనంత కృష్ణ, సంధ్యారాణి, కృష్ణప్రియ, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌ఎండీఏ మొక్కల పంపిణీ షురూ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం హెచ్‌ఎండీఏ పరిధిలో వివిధ ప్రాంతాల్లో మొక్కల పంపిణీని ప్రారంభించారు. దాదాపు 45 నర్సరీల నుంచి కోటి మొక్కలను ఉచితంగా పంపిణీ చేయాలని అర్బన్ ఫారెస్టు విభాగం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం హెచ్‌ఎండీఏ పరిధిలోని అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలలో మొక్కలను పంపిణీ చేయడానికి ప్రణాళికలను సిద్ధం చేసి అమల్లోకి తీసుకొచ్చింది. పలు పార్కులు, ఔటర్ రింగ్‌రోడ్డు టోల్‌బూత్‌ల వద్ద మొక్కలను ఉచితం అందజేశారు. కాలనీల్లో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. హెచ్‌ఎండీఏ నర్సరీల్లో అనేక రకాల పూలు, పండ్ల జాతుల మొక్కలున్నాయని, ముఖ్యంగా బంతి, మందార, మల్లె, ఎగ్జోరా, గ్లుమెరియా పూల మొక్కలు, నేరడు, జామ, దానిమ్మ, పనస తదితర పండ్ల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని అధికారులు తెలిపారు.



సంజీవయ్య పార్కు వద్ద విద్యార్థులకు మొక్కలను పంపిణీ చేస్తున్న అర్బన్ ఫారెస్ట్ అధికారి

## విశ్వబ్రాహ్మణుల సమస్యలను పరిష్కరించాలి



విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల సమస్యలను పరిష్కరించాలని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం నాయకులు కోరారు. మంగళవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు భాస్కరచారి, ప్రధాన కార్యదర్శి చిన్నోజు రవికిరణ్, ఉపాధ్యక్షులు పులిమామిడి శ్రీహరి, పోలోజు వేణుగోపాల్, గొల్లపల్లి ఉపేందర్ తదితరులు ఉన్నారు.

**- గోల్నాక, ఆంధ్రజ్యోతి**



అడిగోపుల వెంకటరత్నంకు నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

## సాహిత్యంలో అభ్యుదయాన్ని పండించిన కవి అడిగోపుల

చిక్కడపల్లి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో అభ్యుదయాన్ని పండించి నవచైతన్యాన్ని రేకెత్తించిన కవి అడిగోపుల వెంకటరత్నం అని పలువురు సాహితీవేత్తలు పేర్కొన్నారు. మానస ఆర్ట్ థియేటర్స్ కవన వేదిక, త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో వెంకటరత్నం సంస్మరణ సభ మంగళవారం గానసభలో కవన వేదిక కార్యదర్శి చీకోలు సుందరయ్య అధ్యక్షతన జరిగింది. నేటి నిజం సంపాదకుడు బైస దేవదాసు, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డా. నాళేశ్వరం శంకరం, అభ్యుదయ రచయితల సంఘం కార్యదర్శి డా. రాపోలు సుదర్శన్, వొద్దిరాజు ప్రవీణ్‌కుమార్, బండారు రామచంద్రరావు, డా. అంబల్ల జనార్దన్, రఘుశ్రీ.. అడిగోపుల వ్యక్తిత్వం, సాహిత్యం గురించి ప్రసంగించారు. సామాన్య, బడుగు, మధ్యతరగతి జీవన స్థితిగతులను తన సాహిత్యంలో ప్రతిబింబించిన కవి వెంకటరత్నం అని అన్నారు. ఆయన రాసిన సుమారు 30 గ్రంథాలను సమగ్ర సాహిత్య గ్రంథంగా వెలువరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వెంకటరత్నం కుమారుడు శ్రీకాంత్, కళా జనార్దనమూర్తి, మానస ఆర్ట్స్ రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్‌ఏబీఏ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ సమ్మిట్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): లైఫ్‌సైన్స్ రంగంలో లేటెస్ట్ అప్డేట్స్‌పై అవగాహన కల్పించేందుకు ఫెడరేషన్ ఆఫ్ ఏషియన్ బయోటెక్ అసోసియేషన్(ఎఫ్‌ఏబీఏ) ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ ప్రొఫెసర్ పి.రెడ్డన్న తెలిపారు. సోమాజిగూడలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫెడరేషన్ ఆఫ్ ఫార్మా ఆంత్రప్రెన్యూర్స్ చైర్మన్ చక్రవర్తితో కలిసి ఆయన మాట్లాడారు. ఈనెల 16న రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్, 17న వేల్‌ట్యాంక్, 18న లైఫ్ సైన్సెస్ ఇన్నోవేషన్ క్లస్టర్ మీట్‌ను కలిపి మొత్తం మూడు ఈవెంట్లు హైదరాబాద్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా లైఫ్ సైన్సెస్ రంగంలో సేవలు అందించిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు.

## వృద్ధురాలి మృతదేహం స్వాధీనం

రాంనగర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాంనగర్ శాస్త్రినగర్‌లో కాలురు ఎల్లమ్మ(75) చనిపోయింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఎల్లమ్మ కొంతకాలంగా భిక్షాటన చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కవాడిగూడ భీమామైదాన్‌లో మట్టికుప్పలను తొలగిస్తున్న డీఎంసీ ఖాదర్ మొయినుద్దీన్, కార్పొరేటర్ జి రచనశ్రీ, అధికారులు

### కొనసాగుతున్న

# 'స్వచ్ఛదనం-పచ్చదనం'

ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం (ఆంధ్రజ్యోతి): రెండో రోజు మంగళవారం కూడా ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా మొక్కలు నాటడంతోపాటు చెత్త, మట్టికుప్పలను తొలగించారు. రోడ్లకు మరమ్మతులు చేసి మొక్కలు పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రతపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.



కాచిగూడ మోతీ మార్కెట్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి



చిక్కడపల్లిలో రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కె. రవిచారి



నల్లకుంటలో మహిళకు మొక్కను అందజేస్తున్న కార్పొరేటర్ యాకర అమృత



బాపూజీనగర్‌లో మట్టి కుప్పను తొలగించాలని సూచిస్తున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్